# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మంచి చేయాలనుకునేవారికి అడ్డంకులు ఉండబోవని, అలాంటి వారందరికీ ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **కూటమి ప్రభుత్వంలో చేపట్టే పనులన్నీ నాణ్యతతో ఉండాలని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది.**
4. **తల్లికి వందనం పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయలేదని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు.**
5. **వినూత్న రీతిలో పోలీసింగ్ నిర్వహించి, ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతామని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.**

==========================

మంచి చేయాలనుకునేవారికి అడ్డంకులు ఉండబోవని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంచిచేసే వారందరికీ ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉంటుందని.. అలాంటి వారంతా ముందుకు రావాలని కోరారు. అక్షయపాత్ర స్ఫూర్తితో రాష్ట్రంలో అతి త్వరలో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామని ప్రకటించారు. గుంటూరు జిల్లా కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రాన్ని చంద్రబాబునాయుడు ఈ రోజు సందర్శించి, అనంతశేష స్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. దైవసేవతో పాటు మానవ సేవను సమానంగా హరేకృష్ణ సంస్థ చేస్తోందని తెలిపారు. ధర్మాన్నికాపాడటానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండటం అందరి అదృష్టమని అన్నారు. దైవత్వాన్ని అందరిలో పెంపొందించేలా అక్షయ పాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధుపండిత్ దాస్ కృషి చేస్తున్నారని చంద్రబాబునాయుడు వివరిస్తూ....

..వాయిస్...

--------------------------

కూటమి ప్రభుత్వంలో చేపట్టే పనులన్నీ నాణ్యతతో ఉండాలని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వాస్పత్రిని ఆయన ఈ రోజు తనిఖీ చేశారు. కొత్తగా చేపట్టిన భవన నిర్మాణ పనుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శ్లాబ్ నుంచి లీకవుతున్న వర్షపునీరు, నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. అనంతరం పాత ఆస్పత్రిలో రోగుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతినికలెక్టర్, వైద్యారోగ్య శాఖ కమిషనర్‌కు ఆయన ఫోనులో వివరించారు. సకాలంలో మిగిలిన పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు.

---------------------------

సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగానూ ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా ఉన్న ముఖేష్ కుమార్ మీనా స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి వివేక్ యాదవ్ నియమితులయ్యారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయలేదని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు. పథకం విధి విధానాలను ప్రభుత్వం తర్వాత ప్రకటిస్తుందన్నారు. అయితే ఈ పథకంలో అర్హతల పేరుతో తప్పుడు ప్రచారం జరుగుతోందని, వాటిని విశ్వసించొద్దని ప్రజలను కోరుతూ నిన్న ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్ ఆధారంగా పథకాలు అమలు చేయాలనుకుంటే ప్రభుత్వం ఆధార్ చట్టం 2016 నిబంధనలపై గెజిట్ విడుదల చేయాల్సి ఉందని, దానినే ఇటీవ విడుదల చేసిందని వివరించారు. ఆ గెజిట్ కేవలం కేంద్ర ప్రభుత్వ ఆధార్ నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న చర్య మాత్రమేనన్నారు. ఆ గెజిట్‌లో ఎక్కడా తల్లికి వందనం పథకం మార్గదర్శకాలు పొందుపరచలేదని శశిధర్ పేర్కొన్నారు.

---------------------------

వినూత్న రీతిలో పోలిసింగ్ నిర్వహించి, ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతామని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. ఈ రోజు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖరబాబు మాట్లాడుతూ.. విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు. సిటిజన్ పోర్టల్ ద్వారా ప్రజలు తమ ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల్లో నమ్మకం కల్గించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. మహిళల భద్రత విషయంలో మరింత సమర్థంగా పనిచేస్తామని.. సీసీ కెమెరాల పని తీరు ను మెరుగు పరుస్తామని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారిని నియంత్రించేందుకు అందరూ సహకరించాలని కమిషనర్ కోరారు. అనంతరం ఆయన ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.

---------------------------

ఎగువ కురుస్తున్న వర్షాల కారణంగా 89 వేల 315 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 71 వేల 514 క్యూసెక్కుల నీటిని సముద్రం లోకి విడుదల చేస్తున్నారు. 115 గేట్లను 20 మిల్లీమీటర్ల మేర పైకెత్తి నీటిని వదులుతున్నారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలవలకు 3800, 1700, 6000 క్యూసెక్కుల చొప్పున మొత్తం 11 వేల 500 నీరు విడుదల చేశామని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 10.75 అడుగుల నీటి మట్టం ఉందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ ట్రస్టు పేరును డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2014-19 మధ్య డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుగా ఉండగా గత హయాంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టుగా పేరు మార్చారు. తాజాగా కూటమి ప్రభుత్వం రావడంతో తిరిగి డాక్టర్ నందమూరి తారక రామారావు వైద్య సేవ ట్రస్ట్‌గా పేరు మార్పు చేశారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు, తెలుగు గంగ ప్రాజెక్టుల స్థితిగతులతో పాటు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికలు రూపొందించాలని జల వనరుల శాఖ అధికారులను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. నెల్లూరులో నిన్న ఆయన జలవనరులశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ రేపు ఈ జలాశయాలను సందర్శిస్తారని రామనారాయణ రెడ్డి తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ సేద్యానికి అరుదైన గుర్తింపు లభించింది. ఈ ఏడాదికి గానూ ప్రతిష్ఠాత్మక 'గుల్బెంకియన్ అవార్డు' ఏపీ సమాఖ్య ప్రకృతి వ్యవసాయానికి దక్కింది. పోర్చుగల్‌లోని లిస్బన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్, మహిళా రైతు నెట్టం నాగేంద్రమ్మ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భారత సంతతి అమెరికన్ శాస్త్రవేత్త రతన్‌లాల్, ఈజిప్టుకు చెందిన స్వచ్ఛందసంస్థ సెకెమ్‌కు కూడా అవార్డు లభించింది. ఈ పురస్కారం కింద ఇచ్చే ఒక మిలియన్ యూరోల నగదు బహుమతిని ముగ్గురు విజేతలకు సమానంగా అందజేస్తారు. 117 దేశాల నుంచి వచ్చిన 181 నామినేషన్లతో పోటీపడి ఏపీసీఎన్ఎఫ్ ఈ అవార్డు దక్కించుకుంది.

---------------------------

జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఆయన 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విశాఖపట్నం సమీపంలోని రుషికొండలో నిన్న ఆత్మీయ సంగమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఉన్నవారికి అధ్యయనం, కష్టపడే మనస్తత్వం ఉండాలని తెలిపారు. నిత్యం ప్రజల్లో తిరగాలని సూచించారు. జీవితంలో ఎన్నో బాధ్యతలు చేపట్టానని, అవన్నీ రావడానికి మిత్రులు, పెద్దల ఆశీర్వాదమే కారణమని చెప్పారు. కార్యదీక్ష ఉంటే కార్యదక్షత అదే వస్తుందని తెలిపారు. మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ దేశంలో స్మార్ట్ సిటీలుగా ఎంపికైన మూడు నగరాల్లో విశాఖకు స్థానం దక్కడానికి వెంకయ్యనాయుడే కారణమని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఈ రోజు, రేపు ఓ మోస్తరు నుంచి ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారి ఎం.వెంకట్రావు ఆకాశవాణికి తెలియజేస్తూ..

వాయిస్ (29సెకన్లు)

=====================